





ష్.. గప్‌చుప్!

ఎప్పుడూ రద్దీగా ఉండే పట్టణాల్లో నరసరావుపేట ఒకటి. విద్య, వైద్య, వాణిజ్య రంగాలకు కేరాఫ్. చుట్టుపక్కన పల్లెలకే కాదు పల్నాటిసీమకే ఆయువుపట్టు ఈ పట్టణం. ఉదయం కోడికూయక ముందే మేల్కొనే ఈ పట్టణం ఎప్పుడో అర్ధ రాత్రి చంద్రుడు మేఘాల చాటుకు వెళ్లినప్పుడు నిద్రకు ఉపక్రమిస్తుంది. అలాంటి పట్టణం సోమవారం సాయంత్రానికే మొత్తం గప్‌చుప్‌మన్నది. తెల్లవారుజామున గూడు వదిలి ఆహారం కోసం వెళ్లిన పక్షులు సాయంత్రానికి తమ బిడ్డలు గుర్తుకు వచ్చి వడివడిగా గూటికి చేరిపోయినట్లు వ్యాపారులు, ఉద్యోగులు, శ్రమజీవులు అంతా ఎవరి ఇళ్లకు వాళ్లు చేరిపోయారు. దీంతో ప్రధాన వీధులన్నీ ఇలా నిర్మానుష్యంగా కనిపించాయి. అప్పుడప్పుడొక వాహనం వచ్చి వెళుతూ.. కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. మంగళవారం ఎన్నికల లెక్కింపు నేపథ్యం, 144 సెక్షన్ అమలులో ఉండటం, దుకాణాలకు సెలవు ప్రకటించడం ఇవన్నీ ఈ నిర్మానుష్యానికి కారణమయ్యాయి. –ఫొటోలు: సాక్షి /నరసరావుపేట

క్లుప్తంగా

98 శాతం పింఛన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో వైఎస్సార్ పెన్షన్ కానుక – సామాజిక భద్రతా పెన్షన్లు మూడోరోజు సోమవారం నాటికి 98 శాతం పంపిణీ చేశారు. మండల పరిధిలో 9659 మంది లబ్ధిదారులకు గాను రూ.2,86,49,000లు పెన్షన్ పంపిణీ చేయాల్సి ఉండగా, ఇందులో 2440 మందికి గాను పెన్షన్ నగదును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన 7219 మందికి సచివాలయ సిబ్బంది శనివారం నుండి పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు



క్రోసూరు: మండల కేంద్రంలోని గ్రంథాయలంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఈ నెల 7వ తేదీ వరకు జరిగే శిక్షణ తరగతుల ద్వారా విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నట్లు గ్రంథాలయాల అధికారి వై.వీరాంజమ్మ సోమవారం తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజు పుస్తక పఠనం, కథలు చెప్పటం, క్యారమ్స్, చెస్ వంటిపోటీల్లో పాల్గొంటున్నారన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

కాశీ విశ్వేశ్వరస్వామికి విశేష పూజలు

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి సోమవారం ప్రీతిపాత్రం కావడంతో అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొన్నారు.

ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలి

మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ఈవీఎంలను స్ట్రాంగ్ రూం నుంచి కౌంటింగ్ కేంద్రంలోకి తెచ్చేప్పటి నుంచి .. లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఏజెంట్లు పూర్తి స్థాయి అప్రమత్తతతో ఉండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సూచించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం కౌంటింగ్ ఏజెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 6 గంటలకే ఎన్నికల కేంద్రంలోకి లెక్కింపు ఏజెంట్లు గుర్తింపు కార్డు, 17–సీ ఫారాలు తీసుకుని వెళ్లాలన్నారు. స్ట్రాంగ్ రూం నుంచి ఈవీఎంలు తీసుకొచ్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో కూటమి కుయుక్తులు పన్నే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీకి పడిన ఒక్క ఓటు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్‌లో లోపాలు గమనిస్తే వెంటనే ఆర్వో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. సర్వేలన్నీ వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నాయని, రాష్ట్రంలోనూ, నియోజవర్గంలోనూ గెలుస్తున్నామని స్పష్టం చేశారు. ముందుగా బ్యాలెట్ ఓట్లు, ఈవీఎం బాక్సుల్లో ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైఎస్సార్ సీపీ చీఫ్ ఏజెంట్ ఉపేష్ అవగాహన కల్పించారు. సమావేశంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెంబాబురావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి పాల్గొన్నారు.

ఎడ్వర్డుపేటతో మొదలై చినతురకపాలెంతో ముగింపు

మరికాసేపట్లో ఈవీఎంలలో దాగిఉన్న అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. నరసరావుపేట నియోజకవర్గంలో పోలైన 81.06 శాతం ఓట్లలో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయి.. ఎవరెవరికి ఎంత మెజార్టీ వచ్చిందో తెలిపోనుంది. తమను మరో ఐదేళ్లపాటు పాలించగలిగే నాయకుడు ఎవరో వెల్లడికానుంది. దాదాపు 22 రోజులుగా నియోజకవర్గ వాసులు ఎదురుచూస్తున్న నిరీక్షణకు నేటితో తెరపడనుంది.

- నేడు నరసరావుపేట నియోజకవర్గ ఓట్ల లెక్కింపు
- 18 రౌండ్లతో పూర్తిచేసేందుకు యంత్రాంగం సన్నాహాలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్, ఆర్వో
- ఓటుహక్కు వినియోగించుకున్న ఓటర్లు 1,92,428 మంది



జేఎన్‌టీయులోని లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లత్కర్, నరసరావుపేట ఆర్వో సరోజని

నరసరావుపేట: నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం కానుంది. మండలంలోని కాకాని గ్రామ సమీపంలోని జేఎన్‌టీయూ కళాశాలలో ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో 2,32,778 ఓట్లు ఉండగా వాటిలో గత మే నెల 13న నిర్వహించిన పోలింగ్ ప్రక్రియలో 1,88,701మంది (81.06 శాతం) ఓటర్లు తమ ఓటు హక్కును 246 బూత్‌ల ద్వారా వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 3551, హోం ఓటింగ్ 176 కలుపుకొని 1,92,428మంది (82.67 శాతం) ఓట్లు వేశారు. ఈవీఎంల ద్వారా పోలైన ఓట్లను 18 రౌండ్ల ద్వారా లెక్కించాలని నిర్ణయించారు. ఒక్కో రౌండ్‌లో 14 బూత్‌ల ఓట్లు లెక్కిస్తున్నారు. ఈ విధంగా 17 రౌండ్లలో 238 బూత్‌ల ఓట్లు లెక్కించగా చివరి 18వ రౌండ్‌లో ఎనిమిదింటిని పూర్తి చేస్తారు. ఓట్ల లెక్కింపు రొంపిచర్ల మండలం ఎడ్వర్డుపేటతో ప్రారంభమై నరసరావుపేట మండలం చినతురకపాలెంతో ముగియనుంది. లెక్కింపు ప్రారంభంకాగానే పోస్టల్ ఓట్లు, హోం ఓట్లు లెక్కింపు ప్రారంభమౌతుంది. ఈవీఎంలు, పోస్టల్ ఓట్ల లెక్కింపు ఒకేసారి విడివిడిగా మొదలవుతాయి. పోస్టల్ ఓట్లు కోసం రెండు టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొదటి ఐదురౌండ్లలో రొంపిచర్ల మండలంలోని బూత్‌ల లెక్కింపు ముగుస్తుండగా ఆరవ రౌండ్ నుంచి నరసరావుపేట మండలం లెక్కింపు ప్రారంభమౌతుంది. ఓట్ల లెక్కింపు రౌండ్ల వారీగా ఈ విధంగా ఉండనుంది.

వినుకొండ నియోజకవర్గం ఫలితాలు తేలేది ఇలా...

వినుకొండ(నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికల్లో వినుకొండ నియోజకవర్గం (99) ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఇలా సాగనుంది. నియోజకవర్గంలో బొల్లాపల్లి, ఈపూరు, శావల్యాపురం, నూజెండ్ల, వినుకొండ రూరల్ మండలం, వినుకొండ టౌన్ మొత్తం కలిపి 299 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. నియోజకవర్గం మొత్తం మీద 2,64,559 ఓట్లు ఉండగా 2,36,036 ఓట్లు పోలయ్యాయి. పోలైన ఓట్లు మొత్తం 22 రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

తొలుత బొల్లాపల్లి మండలం 1 నుంచి 61 బూత్‌లు, తరువాత 62 నుంచి 107 వరకు ఈపూరు మండలం, 108 నుంచి 141 వరకు శావల్యాపురం మండలం, 142 నుంచి 170 వరకు వినుకొండ రూరల్ మండలం, 178 నుంచి 222 వరకు వినుకొండ టౌన్, 223 నుంచి 240 వరకు వినుకొండ రూరల్ మండలం, 241 నుంచి 299 వరకు నూజెండ్ల మండలం బూత్‌లలోని ఓట్లను 22 రౌండ్లలో లెక్కించనున్నారు. బొల్లాపల్లి మండలంలో మొట్టమొదటి బూత్ అయ్యన్నపాలెం నుంచి 299 నూజెండ్ల మండలం ముప్పరాజువారిపాలెం చివరి బూత్ లెక్కింపుతో వినుకొండ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తికానుంది.

రౌండ్లు	పోలింగ్ బూత్‌లు
మొదటి రౌండ్:	ఎడ్వర్డుపేట, తాకలిగుంట తండా, కొత్తపల్లి, రెడ్డిపాలెం, మర్రిచెట్టుపాలెం, విప్పర్ల, మాచవరం, 14వ బూత్ (మాచవరం)
రెండో రౌండ్ :	మాచవరం(15వబూత్), నల్లగార్లపాడు, పరగటిచర్ల, సంతగుడిపాడు, కర్లకుంట, ఆరేపల్లిలోని 28వ బూత్
మూడో రౌండ్ :	ఆరేపల్లి (29వ బూత్), బుచ్చిబాపన్నపాలెం, రామిరెడ్డిపాలెం, రొంపిచర్ల, కొనకంచివారిపాలెం, గోగులపాడు 42వ బూత్
నాల్గవ రౌండ్ :	గోగులపాడు 43వ బూత్, అలవాల, సుబ్బయ్యపాలెం, తురుమెళ్ల, అన్నవరప్పాడు, వీరవట్నం, ముత్తనపల్లి, మునుమాక
ఐదవ రౌండ్ :	విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం, తుంగపాడు, అన్నవరం, నరసరావుపేట మండలంలోని పమిడిపాడు, రావిపాడు 69,70 బూత్‌లు
ఆరవ రౌండ్ :	రావిపాడు, పురపాలకసంఘం 75వ బూత్, ములకలూరు, కేఎం అగ్రహారం రెడ్డిపాలెం, ఇసప్పాలెం 84 వరకు
ఏడవ రౌండ్ :	ఇసప్పాలెం, దొండపాడు, రంగారెడ్డిపాలెం, జొన్నలగడ్డ, కేసానుపల్లి, ఎస్ఆర్‌కేటీ కాలనీ
ఎనిమిదవ రౌండ్ :	బసికాపురం, కొత్తపాలెం, పురపాలకసంఘం బరంపేట, పాతూరు, ఏనుగులబజారు 112వ బూత్
తొమ్మిదవ రౌండ్ :	పట్టణంలో 113వ బూత్ నుంచి 127 వరకు
10వ రౌండ్ :	పురపాలకసంఘం 128 నుంచి 140 వరకు
11వ రౌండ్ :	141 నుంచి 154 వరకు
12వ రౌండ్ :	155 నుంచి 168 వరకు
13వ రౌండ్ :	169 నుంచి 182 వరకు
14వ రౌండ్ :	183 నుంచి 196 వరకు
15వ రౌండ్ :	197 నుంచి 200 బూత్‌వరకు, లింగంగుంట్ల, ఇక్కుర్రు
16వ రౌండ్ :	223, 224 పాలపాడు, కాకాని, అర్వపల్లి, ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం బూత్‌లు
17వ రౌండ్ :	పెట్లూరివారిపాలెం (225, 226), యక్కలవారిపాలెం, కొండకావూరు, పమిడిమర్రు, యలమంద, శ్రీనివాసగిరిజనకాలనీ, చినతురకపాలెం, గురవాయపాలెం 238వ బూత్
18వ రౌండ్ :	గురవాయపాలెం, గోనెపూడి, చినతురకపాలెం

చిలకలూరిపేట గెలుపునకు కీలకం మహిళా ఓట్లే

చిలకలూరిపేట: ఎన్నికల ఫలితాల కోసం గత కొంతకాలంగా వేచిన ప్రజలకు, పార్టీల నేతల ఉత్కంఠకు మరికొన్ని గంటల్లో తెరపడనుంది. వ్యూహాలు, ప్రతివ్యూహాలు, విమర్శలు, ప్రతివిమర్శలతో కొనసాగిన వ్యవహారం మే13 పోలింగ్‌తో ముగిసింది. పోలింగ్ ముగిశాక దాదాపు 22 రోజుల పాటు ఫలితాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజల ఆకాంక్షలు, వారి మనోగతం ఇప్పటి వరకు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉండగా, మంగళవారం వెల్లడికానున్నాయి. ఇప్పటికే కౌంటింగ్‌లో అనుసరించాల్సిన వ్యూహం, విధి విధానాలపై ఆయా పార్టీల కౌంటింగ్ ఏజంట్లకు శిక్షణ కూడా ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ తరుపున కావటి శివనాగ మనోహర్ నాయుడు, టీడీపీ తరుపున మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పోటీ చేశారు. నియోజకవర్గ పరిధిలో పురుషుల ఓట్ల కన్నా మహిళల ఓట్లు అధికం. మహిళల ఓట్లు 1,18,205 ఉండగా, పురుషుల ఓట్లు 1,08,392 ఉన్నాయి. దీని ప్రకారం మహిళల ఓట్లు పురుషుల కన్నా 9,813 అధికం. పోలైన వాటి విషయానికి వస్తే పురుషులవి 92,762 కాగా, మహిళలవి 99,855 ఓట్లు పోలయ్యాయి. దీంతో మహిళల ఓట్లు పురుషుల కన్నా 7,093 అధికంగా పోలయ్యాయి.

పెరిగిన ఓటర్ల చైతన్యం వైఎస్సార్‌సీపీకే అనుకూలం!

పెరిగిన ఓటర్ల చైతన్యం కూడా వైఎస్సార్ సీపీకే అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. పేదలు, పెత్తందార్లకు మధ్య జరిగిన ఈ ఎన్నికల పోరులో ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కు ఉపయోగించుకోవటం వారి చైతన్యానికి నిదర్శనంగా నిలిచింది. గత సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిని గమనించినప్పుడు 1978లో 70.93, 1983లో 69.01 శాతం, 1985 ఎన్నికల్లో 72.53 శాతం, 1989 ఎన్నికల్లో 68.03 శాతం,1994 ఎన్నికల్లో 65.45 శాతం, 1999 ఎన్నికల్లో 64.29 శాతం, 2004 ఎన్నికల్లో 73.70 శాతం, 2009 ఎన్నికల్లో 81.89 శాతం పోలింగ్ నమోదైంది. 2014 ఎన్నికల్లో 85.98 పోలింగ్ శాతం నమోదైంది. 2014 ఎన్నికల్లో 2009 ఎన్నికల కన్నా 4.09 శాతం ఓట్లు అధికంగా పోలయ్యాయి. 2019 ఎన్నికల్లో 85.52 శాతం నమోదుకాగా ప్రస్తుత 2024 ఎన్నికల్లో 86.13 శాతం ఓట్లు పొలయ్యాయి. దీంతో గత ఎన్నికల కన్నా 0.61 శాతం ఓట్లు అధికంగా పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ల విషయానికి వస్తే 2,409 ఓట్లు పోల్ కాగా, హోమ్ ఓటింగ్‌లో 156 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. తొలిరౌండు నాదెండ్ల మండలం సాతులూరు గ్రామం నుంచి ప్రారంభం అవుతుంది. చివరి రౌండు చిలకలూరిపేట మండలం తాతపూడి గ్రామంతో ముగుస్తుంది. పల్నాడు జిల్లాలో తొలి ఫలితం చిలకలూరిపేటది కానుండడం విశేషం. కొన్ని గంటల్లోనే ఫలితాలు వెల్లడి అవుతున్న నేపథ్యంలో చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజల తమ భావినేత కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

నిర్మానుష్యంగా మారిన గ్రామాలు




నిర్మానుష్యంగా మారిన రొంపిచర్లలోని రహదార్లు

రొంపిచర్ల: మండలంలో గత మూడు రోజులుగా పల్నాడు జిల్లా పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రశాంతంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. దీంతో మండలంలో అన్ని గ్రామాలలో పోలీసులు తిరుగుతూ షాపులను, హోటళ్ళను, టీస్టాళ్ళను మూసివేశారు. దీనివల్ల మండలంలో అన్ని గ్రామాలలో అన్ని రకాల షాపులు మూతబడటం వలన నిర్మానుష్యంగా మారినాయి. ఈ నెల 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సోమవారం మండలంలో అన్ని గ్రామాలలో 144 సెక్షన్ కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. ఎస్ఐ కె.పి.రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు అన్ని గ్రామాలలో తిరుగుతూ 144 సెక్షన్ అమల్లో ఉందని, గ్రామస్తులు సహకరించాలని కోరుతున్నారు. గ్రామాలలో ఈ మేరకు పోలీసులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాలలోకి వస్తున్న వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు.

రేపు పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు

నరసరావుపేట ఈస్ట్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5వతేదిన శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ కార్యదర్శి స్వర్ణ చిన రామిరెడ్డి సోమవారం తెలిపారు. పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో 5వతేదీ ఉదయం 10 గంటలకు పోటీ ప్రారంభమవుతుందని వివరించారు. పోటీలో పాల్గొనేందుకు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. పర్యావరణాన్ని ప్రతిబింబించేలా పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్యం, మొక్కల పెంపకం, వాహనాల రద్దీ కాలుష్యం అంశాలలో ఏదో ఒక అంశంపై విద్యార్థులు చిత్రం గీయవచ్చన్నారు. డ్రాయింగ్‌కు సంబంధించిన సామాగ్రిని విద్యార్థులే సమకూర్చుకోవాలన్నారు. విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

• 144 సెక్షన్ కదా..!



ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలు చేయడంతో వినుకొండ పట్టణంలో దుకాణాలు, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. శివయ్య స్థూపం సెంటర్, మెయిన్ బజారు, పల్నాడు రోడ్డు, ముండ్లమూరు బస్టాండ్ సెంటర్ వంటి రద్దీగా ఉండే ప్రాంతాలు కూడా 144 సెక్షన్ కారణంగా జనాలు లేక వెలవెలబోయాయి. ఉదయం నుంచే పోలీసులు ప్రధాన సెంటర్లలో తిరుగుతూ 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దుకాణాలు మూసివేసి అధికారులకు సహకరించాలని కోరారు. ఈ నెల 4వ తేదీ కౌంటింగ్ సందర్భంగా ఎక్కడైనా గొడవలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించడంతో వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. -వినుకొండ(నూజెండ్ల)

పోలీసు ఆంక్షలు ఉల్లంఘించకండి

ఇన్‌చార్జి సీఐ సుబ్బారావు

నాదెండ్ల: ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ పోలీసు ఆంక్షలు ఉల్లంఘించరాదని ఇన్‌చార్జి సీఐ సుబ్బారావు చెప్పారు. సాతులూరు పాలకేంద్రం వద్ద కార్డన్ సెర్చ్ అనంతరం స్థానికులతో ఆయన మాట్లాడారు. మంగళవారం పల్నాడు జిల్లా జేఎన్‌టీయూలో జరిగే సాధారణ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఏ పార్టీ గెలుపొందినా ఉద్రేకాలకు లోనుకావద్దని కోరారు. కవ్వింపు చర్యలు, అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రాజకీయ ప్రేరేపిత ఉద్రిక్తతలతో గ్రామాల్లో శాంతియుత వాతావరణాన్ని భంగం కలిగించవద్దన్నారు. ఊరేగింపులు, బాణాసంచా కాల్చటం నిషేధమన్నారు. కార్యక్రమంలో ఎస్సై జె.బలరామ్‌రెడ్డి ఉన్నారు.

పత్రాలు లేని వాహనాల స్వాధీనం

సమస్యాత్మక గ్రామమైన సాతులూరులో పోలీసులు సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.



సాతులూరులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీఐ సుబ్బారావు

గుర్తుతెలియని వాహనం ఢీకొని గొర్రెల కాపరి మృతి



సర్దా తిరుమలయ్య మృతదేహం

క్రోసూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డు మార్జిన్‌లో నిద్రిస్తున్న గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన సోమవారం వేకువ జామున చోటుచేసుకుంది. ఎస్ఐ ఎం.షఫీ తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా , దేవరకద్ర మండలం, గద్దెగూడెంకు చెందిన సర్దా తిరుమలయ్య(42), మరికొందరితో కలిసి మండలంలోని బాలెమర్రు గ్రామంలో ఉంటూ జీవాలతో వచ్చి చుట్టు పక్కల గ్రామాల్లోని రైతుల పంట పొలాల్లో గొర్రెల ఎరువులు పెడుతున్నారు. రాత్రి వర్షం కురవటంతో గ్రామంలోని తారు రోడ్డు పక్కగా నల్లపట్టా కప్పుకుని నిద్రించాడు. ఈ క్రమంలో వేకువజామున గుర్తుతెలియని వాహనం అతివేగంగా వస్తూ నిద్రపోతున్న తిరుమలయ్యను ఢీకొట్టి వెళ్లింది. దీంతో తీవ్ర గాయాలతో తిరుమలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పూర్తి చేయించి కుమారుడికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.